అప్పుడు 18.. ఇప్పుడు 65

- టెన్త్ మూల్యాంకనంలో విచిత్రం
- సోషల్ పేపర్ రీ వాల్యుయేషన్‌లో ఫస్ట్ క్లాస్ మార్కులు
- ఎస్‌ఎస్‌సీ బోర్డు నిర్వాకంతో గురుకుల విద్యార్థికి తీవ్ర వేదన

దేవరాపల్లి: ఈ ఏడాది జరిగిన టెన్త్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో జరిగిన తప్పిదంతో ఓ వి ద్యార్థి తీవ్ర వేదనకు గురయ్యాడు. రీవాల్యుయేషన్‌లో ఫెయిల్ కాదు.. ఫస్ట్ క్లాస్ అని తేలింది. తెనుగుపూడి డా. బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యార్థి లింగాల ఆకర్ష్ ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాశాడు. ఎస్‌ఎస్‌సీ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో అన్ని సబ్జెక్టుల్లో పాస్ కాగా సోషల్‌లో కేవలం 18 మార్కులు మాత్రమే వచ్చాయి. దీంతో విద్యార్థితోపాటు తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. మూల్యాంకనంపై అను మానం వచ్చి విద్యార్థి తల్లిదండ్రులు ఎస్‌ఎస్‌సీ బోర్డుకు రూ. వెయ్యి చలానా చెల్లించి సోషల్ పేపర్ జవాబు పత్రాన్ని రీ వా ల్యుయేషన్ చేయించారు. పునర్ మూల్యాంకనంలో 65 మార్కు లు వచ్చాయంటూ ఎస్‌ఎస్‌సీ బోర్డు నుంచి లింగాల ఆకర్ష్ ఫోనును సమాచారం వచ్చింది. అతని జవాబు పత్రంలోని పేజీలను పంపించారు. దీంతో తన కుమారుడు పరీక్షలో ఫెయిల్ కాలేదని, పాసయ్యాడని తెలిసిన అతని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. మూల్యాంకనంలో నిర్లక్ష్యంతోనే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటం సరికాదని బాధిత విద్యార్థి తల్లిదండ్రులతో పాటు పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


విద్యార్థి లింగాల ఆకర్ష్

న్యూస్‌రీల్

అనాథ బాలలకు ఆధార్ కార్డులు

అనకాపల్లి టౌన్: అనాథ, నిరాశ్రయ బాలలను సర్వే ద్వారా గుర్తించి వారికి ఆధార్ కార్డులను అందజేస్తామని ఉమ్మడి విశాఖ జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తెలిపారు. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ నెల 25 నుంచి జూన్ 25 వరకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, విద్యాశాఖ, సచివాలయం, పోలీసులు, ఎన్జీవోల ద్వారా బాలలను గుర్తించి ఆయా మండల తహసీల్దార్ల పర్యవేక్షణలో ఆధార్ కార్డులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

ఏజెన్సీకి యథావిధిగా ఆర్టీసీ బస్సులు

నర్సీపట్నం: ఏజెన్సీ ప్రాంతాలకు నర్సీపట్నం ఆర్టీసీ డిపో నుంచి బస్సులను యథావిధిగా తిప్పుతున్నామని డిపో మేనేజర్ ధీరజ్ తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ నేపథ్యంలో పోలీసుల హెచ్చరికతో ఇటీవల అల్లూరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు సాయంత్రం 5 గంటల తరువాత బస్సు సర్వీసులను నిలిపివేశారు. ఏజెన్సీలో పరిస్థితి చక్కబడడంతో గురువారం నుంచి చింతపల్లి, సీలేరు, జీకే వీధి, కేడీ పేట, తాండవ, కొయ్యూరు, మంప ప్రాంతాలకు రాత్రి వేళ నిలిపివేసిన అన్ని బస్సు సర్వీసులను యథావిధిగా కొనసాగిస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు.

మెరిసిన జ్యోతి



- స్వర్ణం, రికార్డు తనదే!
- ఆసియా అథ్లెటిక్స్‌లో చరిత్ర సృష్టించిన విశాఖ అమ్మాయి

విశాఖ స్పోర్ట్స్: భారత మహిళా అథ్లెట్, విశాఖ అమ్మాయి జ్యోతి ఎర్రాజీ మరోసారి తన సత్తా చాటింది. 26వ ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో వంద మీటర్ల హర్డిల్స్‌లో అద్భుతమైన ప్రదర్శనతో స్వర్ణ పతకం సాధించడమే కాకుండా, చాంపియన్‌షిప్ రికార్డును కూడా బద్దలు కొట్టింది. కొరియాలోని గుమిలో గురువారం జరిగిన ఈ పోటీలో జ్యోతి కేవలం 12.96 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని విజేతగా నిలిచింది. ఈ గెలుపుతో పాటు 1998లో చైనాకు చెందిన యున్ ఫెంగ్ నెలకొల్పిన 12.97 సెకన్ల రికార్డును జ్యోతి అధిగమించింది. ఫైనల్స్‌లో పాల్గొన్న మిగిలిన ఏడుగురు అథ్లెట్లు 13 సెకన్ల కంటే ఎక్కువ సమయం తీసుకోగా.. జ్యోతి 13 సెకన్ల లోపే పూర్తి చేయడం విశేషం. జపాన్‌కు చెందిన యుమి తనాకా (13.07 సెకన్లు) రెండో స్థానంలోనూ, చైనాకు చెందిన వు యన్ని (13.07 సెకన్లు) మూడో స్థానంలోనూ నిలిచారు. బుధవారం జరిగిన హీట్స్‌లో జ్యోతి 13.18 సెకన్లలో పూర్తి చేసి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఇప్పుడు ఏకంగా స్వర్ణం సాధించి, రికార్డు బద్దలు కొట్టడం ఆమె పట్టుదలకు నిదర్శనం.

వర్షాలతో భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు


ప్రసాదాల నిల్వశాలను పరిశీలిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా సింహగిరికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేయాల్సిన ఏర్పాట్లపై దేవస్థానం ఈవో వి.త్రినాథరావు గురువారం పరిశీలించారు. స్వామి దర్శనానికి భక్తులు వెళ్లే ఉచిత, రూ.100, రూ.300 క్యూల్లో నడుస్తూ ఎక్కడెక్కడ వర్షం నీరు వస్తోందో ఆయా ప్రాంతాలను గుర్తించారు. నీరు భక్తులపై పడకుండా ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ప్రసాదాల విక్రయశాలకు వెళ్లి, సిబ్బంది పనితీరును పర్యవేక్షించారు. భక్తులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. ప్రసాదాల నిల్వ గది ఇరుగ్గా ఉండటంతో, ప్రత్యామ్నాయ గదిలోకి మార్చాలన్నారు. ప్రసాదాల నాణ్యతలో అలసత్వం ప్రదర్శించవద్దని హెచ్చరించారు.

ఆయిల్‌పామ్ తోటలో గంజాయి డంప్

- 750 కేజీల గంజాయి, 3 ద్విచక్ర వాహనాలు, కారు స్వాధీనం



8లో


ఇది అనకాపల్లి జిల్లా నాతవరం మండలం సిరిపురం గ్రామానికి ఏకంగా అటవీ మార్గంలో నిర్మించిన రహదారి. ఈ రహదారికి అటవీశాఖ నుంచి ఎటువంటి అనుమతి లేదు. ఏకంగా కొండలను తొలుస్తూ నిర్మించిన ఈ రోడ్డు కనీసం 10 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఏ అధికారి కూడా రోడ్డు నిర్మాణ సమయంలో తనిఖీ చేసింది లేదు. ఈ రోడ్డులో దర్జాగా లేటరైట్‌ను 40 లారీల్లో రోజుకు 120 ట్రిప్పుల్లో తరలిస్తున్నారు. ఈ లేటరైట్ విలువ రోజుకు రూ.2 కోట్ల పైమాటే.

ఇది అనకాపల్లి–చోడవరం మార్గంమధ్యలో ఉన్న బవులవాడ గ్రామ పరిధిలోని రావుగోపాలరావు నగర్ కాలనీ, జగనన్న కాలనీలను ఆనుకుని మొత్తం 3 కిలోమీటర్ల వరకు నిర్మించిన రోడ్డు. ఏకంగా కొండను తొలచి మరీ ఈ రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణాన్ని అక్కడ క్వారీల యాజమాన్యాలే చేపట్టాయి. దీనిపై ఫిర్యాదులు వస్తే తూతూ మంత్రంగా విచారణ చేసి.. కనీసం ఇప్పటివరకు కేసు కూడా నమోదు చేయలేదు. ఇక్కడి నుంచి రోజుకు 1,000 ట్రిప్పుల బండరాళ్లను రాంబిల్లి వద్ద నిర్మిస్తున్న నేవల్ బేస్‌కు తరలిస్తున్నారు.




ఇది భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలం గిడిజాల గ్రామ పంచాయతీలోని సర్వే నెంబరు 258లోని స్థలం. ఇదే పంచాయతీలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి రిసార్ట్స్ నిర్మించిన ఓ ఘనుడు ఈ స్థలంలోని లక్షల టన్నుల గ్రావెల్‌ను తరలించి లే–అవుట్ యాజమాన్యాలకు విక్రయించాడు. ఇప్పుడు ఈ భూమిని ఆట స్థలానికి ఇవ్వాలంటూ స్థానికుల ద్వారా డిమాండ్లు పెట్టిస్తున్నాడు. ఈ డిమాండ్ వెనుక అక్రమంగా కొట్టేసిన గ్రావెల్ దందాను ప్రశ్నించకుండా ఉండడమే.

పెందుర్తి మండలంలోని నరవ గ్రామంలో ఎటువంటి అనుమతి లేకుండా ఏకంగా అటవీ శాఖ, ఏపీఐఐసీ భూముల్లో గ్రావెల్‌ను దర్జాగా కొల్లగొడుతున్నారు. అధికారులు మొదట్లో రోడ్డు మధ్యలో వాహనాలు వెళ్లకుండా గుంతను ఏర్పాటు చేస్తే దానిని పూడ్చి మరీ గ్రావెల్ తరలిస్తున్నారు. ఏమిటంటే అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే అండదండలు ఉన్నాయని బెదిరింపులకు దిగుతున్నారు.



ఇవీ మచ్చుకు ఉమ్మడి విశాఖ జిల్లాలో జరుగుతున్న మైనింగ్ అక్రమాలకు సజీవ సాక్ష్యాలు. ఇంత దర్జాగా అక్రమ మైనింగ్‌తో పాటు అడ్డగోలుగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నా అధికారులు మాత్రం కనీసం పట్టించుకోవడం లేదు. కూటమి నేతల హస్తం వీటి వెనుక ఉండటమే ఇందుకు కారణమనే విమర్శలున్నాయి. ఒక వేళ వీటిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారిని ప్రలోభాలకు గురిచేస్తున్నారు. వినకుంటే బెదిరింపులకు దిగుతున్నారు.

అక్రమ మైనింగ్‌కు అడ్డులేకుండా కొత్త ఎత్తుగడ

రేషన్ కార్డుకు రూ.1,500!

నెలవారీ మామూళ్లతో స్థానిక నాయకులకూ వల

- ప్రశ్నించే వారికి బెదిరింపులు
- ఏకంగా కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం
- ఏ శాఖ నుంచీ అనుమతి లేదు
- కనీసం కన్నెత్తి చూడని అధికారులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

మైనింగ్ మాఫియా కొత్త సంస్కృతికి తెర తీసింది. స్థానిక ప్రజలకు రేషన్ కార్డుకు రూ.1,500 చొప్పున అందజేసి ప్రలోభాలకు గురిచేస్తోంది. మైనింగ్ వ్యవహారంపై ఎటువంటి ఫిర్యాదులు చేయవద్దని షరతు విధిస్తోంది. ఎవరైనా ఫిర్యాదు చేసినా, పరిశీలించేందుకు వచ్చినా అడ్డుకోవాలని ఆదేశిస్తోంది. దీన్ని ఏ ఒక్కరూ జవదాటినా నెల నెలా ఇచ్చే రూ.1,500 మొత్తాన్ని నిలిపివేస్తామని బెదిరింపులకు దిగుతోంది. ఇదంతా కూటమి నేతల కనుసన్నల్లో జరుగుతోంది. ఇందులో భాగంగా నర్సీపట్నం, అనకాపల్లిలోని మైనింగ్ ప్రాంతాల్లో రేషన్ కార్డు ఉన్న ప్రతీ ఇంటికీ నెలకు రూ.1,500 చొప్పున ముట్టచెబుతున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఒక స్థాయి నాయకులకు కూడా నెలవారీ మామూళ్లు ఇచ్చి ప్రలోభాలకు గురి చేసినట్లు సమాచారం. వీరికి నెలకు రూ. 10 వేల నుంచి రూ. 30 వేల వరకూ ముట్టచెబుతోంది. దీంతో పాటు అధికారులకు కూడా ట్రిప్పునకు ఇంత మొత్తం చొప్పున నెలవారీ మామూళ్లు అందుతుండటంతో.. ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా కనీసం అటువైపుగా చూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ మైనింగ్ వ్యవహారంలో స్థానికంగా ఉన్న ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా రేషన్‌కార్డుకు రూ.1,500 చొప్పున అప్పగిస్తూ.. మైనింగ్ మాఫియా మాత్రం కోట్లలో అక్రమంగా ఆర్జిస్తోంది. దీర్ఘకాలంలో గ్రామానికి నష్టం వాటిల్లుతుందని ఎవరైనా ప్రశ్నిస్తే... రేషన్‌కార్డుపై ప్రతీ నెలా ఇచ్చే మొత్తం రాదంటూ స్థానికులను వారిపై రెచ్చగొడుతోంది. ఫలితంగా ఆయా గ్రామాల్లో స్థానికుల మధ్యనే కొట్లాట కుంపట్లను రాజేసి మైనింగ్ మాఫియా చలికాసుకుంటోంది.

కూటమి నేతలు ఫిర్యాదు చేసినా...!

- వాస్తవానికి మైనింగ్ వ్యవహారంలో కూటమి నేతల మధ్యనే వివాదాలు రాజుకుంటున్నాయి. ఇష్టారీతిలో సాగుతున్న మైనింగ్ వ్యవహారంపై కూటమి పార్టీలోని నేతలే ఫిర్యాదు చేసే పరిస్థితి ఏర్పడింది.
- చోడవరం నియోజకవర్గంలో లక్కవరం, గవరవరం, శేమునాపల్లి, వెంకన్నపాలెం, నరసాపురం, జుత్తాడ, భోగాపురం వంటి గ్రామాల్లో విచ్చలవిడిగా మైనింగ్ దందా జరుగుతోందని స్వయంగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు తహసీల్దారుతో పాటు విశాఖలోని విజిలెన్స్ ఎస్పీకి కూడా ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. శారదా నదిలోని ఇసుకను ఏ విధంగా ఇష్టారీతిలో తవ్వేస్తున్నారో కూడా ఫొటోలతో సహా వివరించారు. ఫిర్యాదుల పరంపర వారం రోజులుగా సాగుతున్నా.. చడీచప్పుడు లేకుండా పోయింది.
- పెందుర్తి నియోజకవర్గంలోని పెందుర్తి, సబ్బవరం మండలాల్లో సాగుతున్న గ్రావెల్ దందాపై కూడా కూటమి పార్టీలోని నేతలు ఆధారాలతో సహా ఫిర్యాదులు చేస్తున్నారు.
- భీమిలిలోనూ అదే పరిస్థితి ఉంది. కూటమి పార్టీల పేరుతో కబ్జాల ఘనుడు చేస్తున్న వ్యవహారంతో పాటు అక్రమంగా గ్రావెల్ తవ్వకాలపై కూడా ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం ఉండటం లేదు.
- అనకాపల్లి జిల్లాలో కూడా నేరుగా అనుమతి లేని లారీలు పదుల సంఖ్యలో తిరుగుతున్నాయంటూ స్వయంగా ఎమ్మెల్యే అధికారులకు ఫిర్యాదు చేశారు. అనుమతి లేకుండా ఎలా తిరగనిస్తున్నారని నిలదీశారు. అయినప్పటికీ రెండు, మూడు రోజులు నిలిచిన వ్యవహారం ఇప్పుడు యథావిధిగా సాగుతూనే ఉంది.
- యలమంచిలి నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే అవినీతి వ్యవహారాలపై టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు నేరుగా ధ్వజమెత్తుతున్నారు. రాంబిల్లి వద్ద నిర్మిస్తున్న నేవల్ బేస్‌కు బండరాళ్ల తరలింపులో భారీగా అక్రమాలు జరుగుతున్నాయని.. అధిక లోడుతో అనేక వాహనాలు వస్తున్నాయని అక్కడి టీడీపీ నేతలు మండిపడుతున్నారు. ఇందులో ఎమ్మెల్యే భారీగా వాటాలు తీసుకుంటున్నారని కూడా పరోక్షంగా ధ్వజమెత్తుతున్నారు.
- ఇలా అన్ని నియోజకవర్గాల్లోనూ కూటమిలోని ఒక పార్టీ చేస్తున్న మైనింగ్ దందాను మరో పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. అయినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదంటే కూటమి ప్రభుత్వంలో పరిస్థితి ఎంత అధ్వానంగా తయారైందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

మైక్‌తో దాడికి యత్నం

- మున్సిపల్ వైస్ చైర్మన్‌పై టీడీపీ కౌన్సిలర్ దౌర్జన్యం
- వైఎస్సార్‌సీపీ, టీడీపీ సభ్యుల మధ్య వాగ్వాదం
- పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమణిగిన వివాదం


వైస్‌చైర్మన్‌పై దాడికి దిగిన టీడీపీ కౌన్సిలర్ మధు.. ఆయనను వారిస్తున్న సహచర కౌన్సిలర్లు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు ఆవేశంతో వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణపై మైకుతో దాడికి యత్నించడం కలకలం రేపింది. మున్సిపాలిటీ అభివృద్ధిపై చర్చకు సిద్ధమంటూ టీడీపీ, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు విమర్శలు, ప్రతి విమర్శలతో చాలెంజ్ చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన వైస్ చైర్మన్ రామకృష్ణ, కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు మధ్య మాట మాట పెరిగి, పరిస్థితి అదుపు తప్పింది. టీడీపీ కౌన్సిలర్ మధు మైక్‌తో వైస్ చైర్మన్ రామకృష్ణపైకి దాడికి యత్నించారు. దీంతో సమావేశంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మైక్‌తో పదే పదే దూసుకు వచ్చిన టీడీపీ కౌన్సిలర్ మధును వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్లు, అధికారులు అదుపు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలో స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు సహకారంతో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, గత ప్రభుత్వంలో పైసా పని జరగలేదని టీడీపీ కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ రూ.25 కోట్లతో మున్సిపాలిటీని అభివృద్ధి చేశారని చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ రామకృష్ణ బదులిచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నది ఐదేళ్లే, మీ కుటుంబానికి ప్రజలు ముప్పేళ్లకు పైగా అధికారం ఇస్తే ఇంకా రోడ్లు వేస్తున్నాం, డ్రైనేజీలు కడుతున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని వైస్ చైర్మన్ రామకృష్ణ అన్నారు. దీంతో టీడీపీ కౌన్సిలర్ మధు, వైస్ చైర్మన్ రామకృష్ణ మధ్య మాటా మాటా పెరిగింది. టీడీపీ కౌన్సిలర్ మైక్‌తో దాడికి యత్నించారు. కౌన్సిలర్లు, అధికారులు సమయస్ఫూర్తితో వ్యవహరించకపోతే అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మరింత కొట్లాట జరిగేది. టౌన్ సీఐ గోవిందరావు సిబ్బందితో రంగప్రవేశం చేయడంతో వివాదం సద్దుమణిగింది.

సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ నిర్వాహకులను మార్చడం సరికాదు

అజెండాలోని పదో అంశంపై వైస్ చైర్మన్ రామకృష్ణ, మాకిరెడ్డి బుల్లిదొర, మరో వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ కక్షతో సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ నిర్వాహకులను మార్చడం సరికాదని కమిషనర్ సురేంద్రను నిలదీశారు. వాటర్ ప్లాంట్ నిర్వహణకు ఎలాంటి అగ్రిమెంట్ లేనందున స్వయం సహాయక సభ్యులకు నిర్వహణ బాధ్యత అప్పగిస్తున్నామని కమిషనర్ బదులిచ్చారు. సుజల స్రవంతి వాటర్ ప్లాంట్లను అందుబాటులోకి తెచ్చింది టీడీపీ, అప్పుడు ఉన్న అధికారులే ఇప్పుడు ఉన్నారు, అగ్రిమెంట్ లేకుండా ఎలా ఇచ్చారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నిలదీశారు. వారికి కనీసం నోటీసు ఇవ్వకుండా తొలగించటం సరికాదని వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్ కల్పించుకుని మరోసారి ఆలోచించి నిర్ణయం తీసుకుందామని, ఈ అంశాన్ని పక్కన పెట్టాలని అధికారులకు సూచించారు. కౌన్సిలర్లు సౌజన్య, రామరాజు తమ వార్డుల్లోని సమస్యలను ప్రస్తావించారు.

కదిలివచ్చిన రెవెన్యూ యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్..

- 'రీ–సర్వే సవరణకు ముప్పుతిప్పలు' వార్తకు స్పందన
- కలెక్టర్ ఆదేశాలతో బాధిత రైతును కలిసిన తహసీల్దార్
- సమస్య పరిష్కరించి న్యాయం చేస్తామని హామీ


మునగపాకలో రైతు అప్పారావు పొలం వద్ద తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది

మునగపాక: 'రీ–సర్వే సవరణకు ముప్పుతిప్పలు' పేరిట గురువారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ స్పందించారు. ఆమె ఆదేశాలతో రెవెన్యూ అధికారులు కదిలి వచ్చి, బాధిత రైతును కలిసి వివరాలు తీసుకున్నారు. వెంటనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తన భూమికి సంబంధించి రీ–సర్వేలో జరిగిన లోపాలను సవరించి తనకు న్యాయం చేయాలని కోరుతూ మునగపాకకు చెందిన రైతు పీలా అప్పారావు అధికారుల చుట్టూ పదే పదే తిరిగినా ఫలితం లేకపోవడంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో సైతం ఫిర్యాదు చేశారు. నెలలు గడుస్తున్నా తన సమస్య పరిష్కారం కాలేదని 'సాక్షి' వద్ద తన గోడు వినిపించుకున్నారు. గురువారం వెలువడిన వార్తా కథనానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు, డీటీ శేషుబాబు, ఆర్ఐ పడాల్, సర్వేయర్, వీఆర్వోలు రైతు అప్పారావు పొలానికి చేరుకొని రికార్డులు అక్కడికక్కడే పరిశీలించారు. అప్పారావుకు సంబంధించిన భూమికి అతని పాస్ పుస్తకంలోని సర్వే నెంబరుకు సరిపడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అప్పారావుకు రీ–సర్వేలో ఎటువంటి ఇబ్బంది లేకుండా న్యాయం జరిగేలా కృషి చేస్తామని చెప్పారు.

నేడు విశాఖపట్నం-కిరండూల్ పాసింజర్ రద్దు


తాటిచెట్లపాలెం (విశాఖ): కొత్తవలస–కోరాపుట్ సెక్షన్ తైడ–చిమిడిపల్లి పరిధిలో ట్రాక్ పునరుద్ధరణ ప నులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి. బుధవారం ఇక్కడ గూడ్స్ రైలు పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్‌బోరా, ఏడీఆర్ఎం(ఇన్‌ఫ్రా) ఇ.శాంతారాం పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే రైళ్లను శుక్రవారం రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం–కిరండూల్(58501) పాసింజర్, కిరండూల్–విశాఖపట్నం (58502) పాసింజర్, కిరండూల్–విశాఖపట్నం (18516) నైట్ ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయని చెప్పారు.

ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్

భువనేశ్వర్–బెంగళూరు–భువనేశ్వర్ మధ్య నడుస్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు థర్డ్ ఏసీ కోచ్‌ను అదనంగా జత చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. భువనేశ్వర్–బెంగళూరు(18463) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు, బెంగళూరు–భువనేశ్వర్ (18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ఈ నెల 30 నుంచి జూన్ 1 వరకు ఈ సదుపాయం ఉంటుంది.

అవినీతి, దోపిడీయే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- మహానాడులో టీడీపీ సొంత డబ్బా
- హామీలు అమలు చేయకుండా సంబరాలు సిగ్గుచేటు
- జూన్ 4న వెన్నుపోటు దినం పేరుతో ఆందోళన
- వైఎస్సార్‌సీపీ పార్లమెంటు సమన్వయకర్త కరణం ధర్మశ్రీ


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పార్లమెంటు సమన్వయకర్త కరణం ధర్మశ్రీ

చోడవరం : కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కాలం పూర్తయినా వారి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలేవీ నెరవేర్చకుండా మహానాడులో టీడీపీ సంబరాలు చేసుకోవడం సిగ్గు చేటని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటు సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ఎద్దేవా చేశారు. చోడవరంలో పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతేడాది జూన్ 4న కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిందని, ఈ ఏడాది కాలంలో హామీలేవీ నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. మహానాడులో చంద్రబాబుకు మీరే హీరో అంటూ డబ్బా కొట్టుకున్నారు తప్ప ప్రజల కోసం ఏం చేశారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తూ, నోటీసులు ఇవ్వకుండా భవనాలు కూల్చేస్తూ నానా ఇబ్బందులు పెడుతూ నిలదీసిన వారిపై కూడా కేసులు పెడుతున్నారన్నారు. ఎన్ని కష్టాలైనా మా నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజల పక్షాన నిరంతరం వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేస్తూనే ఉంటుందన్నారు. దీనిలో భాగంగానే జూన్ 4న వెన్నుపోటు దిన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. చోడవరం పట్టణంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, పెద్దసంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ఎండగట్టి ప్రజలకు తెలియజేయాలన్నారు. అనకాపల్లి పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో కూడా ఈ వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. గతంలో చిన్నచిన్న గోతులు ఉన్న రోడ్లనే తాము బాగు చేయించలేదని ఎన్నికల ముందు గగ్గోలు పెట్టిన కూటమి నాయకులు ఇప్పుడు ఏడాది కాలంలో ఏ రోడ్డు బాగుచేయించారని ప్రశ్నించారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో నిధులు మంజూరు చేసినా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు చేయకుండా వదిలేశారని, అధికారంలోకి వస్తే మేము చేయించేస్తామని చెప్పిన టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీ ఇప్పుడు ఏమయ్యారని ధర్మశ్రీ ప్రశ్నించారు. రోజుకి రూ.లక్ష చొప్పున జిల్లా మంత్రులు, నాయకులకు కప్పం చెల్లించాల్సిన దోపిడీకి కూటమి ప్రజాప్రతినిధులు తెరతీశారని ధర్మశ్రీ ఆరోపించారు.

ఉక్కు కార్మికులకు హెచ్ఆర్ఎఫ్ సంఘీభావం

విశాఖ సిటీ: విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల పోరాటానికి మానవ హక్కుల వేదిక(హెచ్ ఆర్ఎఫ్) సంఘీభావం ప్రకటించింది. తొలగించిన 3 వేల మంది కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.జగన్నాథరావు, సమన్వయ కమిటీ సభ్యుడు వి.ఎస్.కృష్ణ డిమాండ్ చేశారు. తొలగింపునకు సిద్ధం చేసిన 1,800 మంది కార్మికులను విధుల్లో కొనసాగించాలని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేయడంతో ఉత్పత్తి కుంటుపడుతుంటే.. వారి సమస్యలు పరిష్కరించాల్సిన విశాఖ ఉక్కు యాజమాన్యం పోలీసులతో భయభ్రాంతులకు గురి చేయడాన్ని ఖండించారు. పరిశ్రమకు రూ.11,440 కోట్లు ప్యాకేజీ ఇచ్చి, జీఎస్టీ, ఇతర అప్పులు లేకుండా చేసి ప్రైవేటు వ్యక్తులకు ఈ పరిశ్రమను అప్పజెప్పాలని కుట్ర చేస్తున్నట్లుగా మానవ హక్కుల వేదిక భావిస్తోందని తెలిపారు. న్యాయమైన సమస్యలపై పోరాడుతున్న కార్మికులను సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసులతో నిలువరించడం పారిశ్రామిక వివాదాల చట్టం 1948 ఉల్లంఘనగా పేర్కొన్నారు. ఇటువంటి అప్రజాస్వామిక చర్యలు వెంటనే నిలుపుదల చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించి, కర్మాగారంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు.

డీటీవో భవనం మెట్లు కూలి గాయపడ్డ సిబ్బంది



కూలిపోయిన ఇనుప మెట్లు

మహారాణిపేట: కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఉన్న జిల్లా ట్రెజరీ కార్యాలయం(డీటీవో) మెట్లు పాక్షికంగా కూలిపోయాయి. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ట్రెజరీ కార్యాలయానికి వెళ్లే ఐరన్ మెట్లలో ఓ భాగం పడిపోయింది. ఈ ఘటనలో ఆఫీస్ సబార్డినేట్ ప్రసాద్ తలకు గాయం అయింది. త్రుటిలో ప్రాణాపాయం తప్పిందని సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

వర్షం కురిస్తే భయం

ఎప్పుడు వర్షం కురిసినా ట్రెజరీ కార్యాలయ పరిస్థితి దారుణంగా ఉంటుంది. 2014లో వచ్చిన హుద్‌హుద్ తుపానుకు పూర్తిగా ధ్వంసమైన భవనంలోనే ఇప్పటికీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వర్షం పడితే ఆ భవనంలో ఉండేందుకు భయపడే పరిస్థితి. కొన్ని రోజుల క్రితం ఇదే కార్యాలయానికి చెందిన ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ పూర్తిగా కూలిపోయింది. సిబ్బంది విధుల్లో లేని సమయంలో ఆ సంఘటన జరగడంతో ప్రాణనష్టం వాటిల్లలేదు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం కార్యాలయ మార్పునకు చొరవచూపట్లేదు.

పక్కనే పక్కా భవనం..!

జిల్లా ట్రెజరీ కార్యాలయానికి నూతన భవనాన్ని జిల్లా పరిషత్ పక్కన నిర్మించారు. ఎలక్ట్రిక్, చిన్న చిన్న పనులు మినహా భవనం సిద్ధంగా ఉంది. అయినప్పటికీ వివిధ సాంకేతిక కారణాల పేరిట ఇంకా దీన్ని ప్రారంభించలేదు. తాజా ఘటనతో జిల్లా ట్రెజరీ అధికారి వై.సుధాకర్ కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్ దృష్టికి కార్యాలయ సమస్యను తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ స్పందించి కొత్త భవనం ప్రారంభోత్సవానికి ఆటంకాలపై ఆరా తీశారు.

విద్యుత్ లైన్ ఏర్పాటులో ఉద్రిక్తత


నీడనిచ్చే చింతచెట్లను నరకడాన్ని అడ్డుకుంటున్న గ్రామస్తులు

పెదపూడిలో అధికార పార్టీ కుట్ర • సాక్షి కథనానికి స్పందించిన అధికారులు

బుచ్చెయ్యపేట: మండలంలోని పెదపూడిలో విద్యుత్ లైన్ ఏర్పాటులో ఉద్రిక్తత ఏర్పడింది. ఐదు గ్రామాలకు 24 గంటల పాటు కరెంట్ సరఫరా కోసం రోడ్డుకు ఎడమ వైపు విద్యుత్ లైన్ వేయగా, పెద్దపూడిలో మాత్రం అధికార పార్టీ నాయకులు కుట్రపూరితంగా చెట్లను తొలగించడానికి కుడి వైపునకు మార్చాలని అధికారులపై ఒత్తిడి చేశారు. దానికి గ్రామస్తులు ఒప్పుకోకపోవడంతో మళ్లీ పనులు ఆగిపోయాయి. అంధకారంలో 5 గ్రామాలు అనే శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు గురువారం విద్యుత్ లైన్ కలపడానికి యంత్ర పరికరాలతో పెదపూడి వచ్చారు. సీతయ్యపేట నుంచి పెదపూడి, ఫంగిడి, ఎస్ఎల్‌నగర్, ఉప్పరగూడెం, చిన్నయ్యపాలెం గ్రామాలకు విద్యుత్ స్తంభాలు, వైర్లు ఆరు నెలల క్రితమే వేశారు. పెదపూడి దగ్గరలో రెండు విద్యుత్ స్తంభాలను మాత్రం రోడ్డుకు అవతల(కుడి) వైపు మార్చు


స్తంభాలు వేయడానికి వచ్చిన యంత్రాలను అడ్డుకున్న గ్రామస్తులు

చేయాలని గ్రామానికి చెందిన ఒకరిద్దరూ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో వందల ఏళ్ల నాటి చెట్లను తొలగించడానికి వారు ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇటీవల వేసిన రెండు విద్యుత్ స్తంభాలను తీసి భారీ చెట్లు ఉన్న రోడ్డుకు అవతల వైపు మార్పు చేయాల్సిన అవసరమేంటని ఆగ్రహించారు. యంత్ర పరికరాలు పనులు చేయకుండా సర్పంచ్ గోకివాడ వరకృష్ణ, గ్రామస్తులు గోకివాడ నాయుడు, సాయి, నారాయణ, వీరునాయుడు, చిరంజీవి, బొట్టా శివ, ఆలేటి రామకృష్ణ, వియ్యపు సోమునాయుడు, రామునాయుడు, మీసాల అప్పారావు, మీసాల నూకరాజు, గోకివాడ దేముడు, రమణ, వియ్యపు ప్రవీణ్, కుంచం శివప్రసాద్, లాలం గంగరాజు, పోలిరెడ్డి దేముడు, కిల్లాడ బుల్లిబాబు, సాగిరాజు సన్యాశిరాజు, వర్మ తదితర గ్రామస్తులు అడ్డుకున్నారు. అధికారులు అధికార పార్టీ నేతలు చెప్పినట్టు చేస్తున్నారు తప్ప నిబంధనలు పాటించడం లేదని మండిపడ్డారు. గతంలో వేసిన విద్యుత్ స్తంభాలకే వైర్లు బిగించి కరెంట్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. దాంతో సిబ్బంది చేసేది లేక యంత్రాలతో వెనుదిరిగారు.

మెరైన్ పరిశ్రమ కార్మికురాలి అనుమానాస్పద మృతి


సాయిమెరైన్ పరిశ్రమ


మృతురాలు అనిత


పరిశ్రమలో విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

ఎస్.రాయవరం : సాయి మెరైన్ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికురాలు అనుమానస్పద స్థితిలో మృతి చెందడంతో స్థానికుల్లో ఆందోళన రేకెత్తింది. సుమారు 5 వందలకు పైగా కార్మికులు పని చేసే ఈ పరిశ్రమలో ప్రాథమిక స్థాయిలో వైద్యం అందివ్వకపోవడం, 10 కిలోమీటర్లలోపు దూరంలో ఉన్న నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చేసరికి 19 ఏళ్ల యువతి మృత్యువాత పడడం పలు అనుమానాలకు తావిస్తున్నాయి. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ ప్రాంతానికి చెందిన హులకా అనిత (19) కొన్ని నెలలుగా పరిశ్రమలో పనిచేసేందుకు వచ్చి, ఇదే పరిశ్రమలో ఉన్న హాస్టల్‌లో ఉంటున్నది. రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అనితకు పరిశ్రమ యాజమాన్యం కనీసం ప్రాథమిక వైద్యం కూడా అందివ్వకపోవవడంతో బుధవారం రాత్రి మృతి చెంది ఉంటుందని ప్రజా సంఘాల నాయకుడు ఎం.అప్పలరాజు ఆరోపించారు. కాగా ఆమె అనారోగ్యమా, ఇతర కారణాలతో మృతి చెందిందా? అనే విషయాలు తెలియడం కోసం ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్ట్ ఆధారంగా పోస్టుమార్టం చేయాలని విశాఖపట్నం కేజీహెచ్‌కి మృతదేహాన్ని తరలించినట్టు అడ్డురోడ్డు సీఐ రామకృష్ణ, ఎస్ఐ విభీషణరావు తెలిపారు. మృతురాలి కుటుంబసభ్యులు ఒడిశా రాష్ట్రం నుంచి రావాల్సి ఉండగా సాయంత్రానికి ఫిర్యాదు రాలేదని, వచ్చిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ చెప్పారు. ఈ విషయం గురువారం పరిశ్రమ పరిసర ప్రాంతాల వారికి తెలియడంతో కొందరు మీడియావారు, ప్రజాసంఘాల నాయకులు పరిశ్రమలోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే పరిశ్రమ యాజమాన్యం వారిని లోపలికి అనుమతించకపోవడంతో స్థానికులు తహసీల్దార్ రమేష్‌బాబుకి ఫోన్‌లో సమాచారం అందించారు. తహసీల్దార్ ఆర్ఐ మణికంఠను వివరాలు తెలుసుకుని నివేదిక తీసుకురావాలని ఆదేశించడంతో ఆర్ఐ మణికంఠ పరిశ్రమలో విచారణ చేపట్టారు. జ్వరం ఎక్కువగా వచ్చిందని ఆస్పత్రికి తీసుకువెళ్లే సరికి చనిపోయినట్టు చెప్పారన్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే కార్మికురాలి మృతి : సీపీఎం నేతల ఆరోపణ

సాయి మెరైన్ పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే కార్మికురాలు అనిత మృతి చెందిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆరోపించారు. బుధవారం రాత్రి సమయంలో కంపెనీలో మృతి చెందిన అనితను నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా, అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు చెప్పారన్నారు. అనిత మృతి పట్ల సమగ్ర విచారణ జరిపించాలన్నారు. బాధిత కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో పరిశ్రమల్లో కార్మికులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. 1979 వలస కార్మికుల చట్టాన్ని అమలు చేసి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దివీస్ ఉద్యోగి ఆత్మహత్య

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెంలోని అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న దివీస్ ఉద్యోగి మజ్జి రామకృష్ణ (30) గురువారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న మరొక వ్యక్తి గ్యాస్ సిలిండర్ కోసం రామకృష్ణ ఇంటి తలుపు తట్టగా.. లోపల ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో ఆయన భీమిలి పోలీసులకు సమాచారం అందించారు. కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌కు చెందిన రామకృష్ణ దివీస్ లేబొరేటరీలో కెమిస్ట్ విభాగంలో ఉద్యోగి. అతనికి శ్రీకాకుళం జిల్లా వీరఘట్టానికి చెందిన నవ్యతో వివాహం అయింది. వీరికి 4, 6 ఏళ్ల వయసున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పిల్లలతో కలిసి అతని భార్య పుట్టింటికి వెళ్లినట్లు తెలిసింది. రామకృష్ణ మన స్తాపంతోనే ఉరి వేసుకున్నట్టు ప్రాథమిక సమాచారం. పోస్టుమార్టం మృతదేహాన్ని పోలీసులు భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రేక్షకుల రుణం తీర్చుకునే చిత్రం 'థగ్ లైఫ్'

ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కమల్‌హాసన్, త్రిష సందడి




బీచ్‌రోడ్: 'థగ్ లైఫ్'ఒక అద్భుతమైన సినిమా అని హీరో కమల్‌హాసన్ అన్నారు. నగరంలోని గురజాడ కళాక్షేత్రంలో గురువారం చిత్ర యూనిట్ గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా కమల్‌హాసన్ మాట్లాడుతూ విశాఖపట్నం తనను ఎంతో ఆదరించిందన్నారు. 21 ఏళ్ల వయసులో ఇక్కడికి వచ్చిన తనకు 'మరో చరిత్ర'చిత్రం తిరుగులేని అభిమానగణాన్ని అందించిందని గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత 'ఏక్ దుజే కేలియే'చిత్రం హిందీలో విజయం సాధించినప్పుడు తెలుగు ప్రేక్షకులు ఎంతోగానో ఆనందించారన్నారు. 'సాగర సంగమం', 'ఏక్ దుజే కేలియే', 'శుభసంకల్పం' వంటి చిత్రాలు షూటింగ్‌లు ఇక్కడే జరిగాయని, ఇది తన సొంత ఇల్లు లాంటిదని ఆయన పేర్కొన్నారు. మంచి కళ ఎక్కడ కనిపించినా తాను సెల్యూట్ చేస్తానని, అందులో ఎన్నో విషయాలు నేర్చుకుంటానని కమల్ అన్నారు. తాను కొన్ని చెడు సినిమాలు కూడా చేశానని, వాటిని ప్రేక్షకులు మరిచిపోయి కేవలం మంచి చిత్రాలనే గుర్తు పెట్టుకున్నందుకు వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. మంచి సినిమాలు అందించడం తన బాధ్యత అని అన్నారు.

తాను నటించిన 15 తెలుగు చిత్రాల్లో 13 విజయవంతం అయ్యాయని, ఆ విజయాలన్నీ ప్రేక్షకుల వల్లే సాధ్యమయ్యాయని చెప్పారు. ఫ్లాప్‌లు మాత్రమే తన ఖాతాలో వేసుకుంటానన్నారు. ప్రేక్షకుల రుణం తీర్చుకోవడానికి 'థగ్ లైఫ్'చిత్రాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. 'థగ్ లైఫ్'చాలా గొప్ప చిత్రమని, శింబు అద్భుతమైన నటన కనబరిచారని, ఇది వరకు చూడని పాత్రలో ఆయన కనిపిస్తారని కొనియాడారు. అభిరామి కూడా అద్భుతంగా నటించారని, నాజర్‌తో తనది చాలా కాలం నాటి ప్రయాణమన్నారు. త్రిష నటన ప్రేక్షకులను తప్పకుండా మెప్పిస్తుందని, తామంతా కలిసి ఒక గొప్ప సినిమా చేశామని నమ్ముతున్నట్లు చెప్పారు. జూన్ 5న తాము అనుకున్నది కరెక్టో కాదో ప్రేక్షకులు సినిమా చూసి చెప్పాలని కోరారు.

హీరో శింబు మాట్లాడుతూ తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ మంచి సినిమాలను ఆదరిస్తారని, ఈ చిత్రం కూడా తప్పకుండా అందరికీ నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఓజీ'సినిమాలో తాను ఒక పాట పాడానని, అది త్వరలోనే విడుదల కానుందని తెలిపారు. పవన్ కల్యాణ్ నటించిన 'హరి హర వీరమల్లు'చిత్రం కూడా త్వరలో విడుదల కానుందని, ఆ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. హీరోయిన్ త్రిష మాట్లాడుతూ 'వర్షం'సినిమా విడుదలై 22 ఏళ్లు పూర్తయినప్పటికీ ఇప్పటికీ ఇంత అభిమానం చూపిస్తున్న ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. వైజాగ్ తనకెంతో ఇష్టమైన నగరమని, 'థగ్ లైఫ్' సినిమాలో కమల్ హాసన్‌తో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ చిత్రంలో తాను ఇంద్రాణి అనే పాత్ర పోషించానని, ఆ పాత్ర తప్పకుండా ప్రేక్షకులకు గుర్తుండిపోతుందన్నారు.

• నిన్న ఇసుక.. నేడు రాళ్లు.. రేపు.?


బుధవారం


గురువారం

సాగరతీరంలో కొన్ని గంటల్లో చోటుచేసుకున్న అనూహ్యమైన మార్పులు ఆందోళన కలిగిస్తున్నాయి. అంబికా సీ గ్రీన్ హోటల్ ఎదురుగా ఉన్న బీచ్ రోడ్డు ప్రాంతంలో బుధవారం కనిపించిన దృశ్యం.. ఒక్క రాత్రిలోనే పూర్తిగా మారిపోయింది. నిన్నటి వరకు ఇసుక మేటలతో నిండి ఉన్న ఈ ప్రాంతం.. గురువారం ఉదయానికి కెరటాల తీవ్రతకు ఇసుకంతా కొట్టుకుపోయింది. ఇప్పుడు అక్కడ గతంలో వేసిన రాళ్లు దర్శనమిస్తున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మరో రెండు రోజుల్లో తీరంలోని కొబ్బరి వనాలకు కూడా తీవ్రమైన ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. గతంలోనూ ఇదే ప్రాంతం భారీగా కోతకు గురైన విషయం తెలిసిందే. అప్పట్లో అధికారులు యుద్ధ ప్రాతిపదికన మట్టి, రాళ్ల డంపింగ్ చేసి తాత్కాలికంగా కోతను నివారించారు. అయితే ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు మరింత ఆందోళనకరంగా ఉన్నాయి. అధికారులు తక్షణమే స్పందించి, తగిన చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు. – ఏయూ క్యాంపస్

ఆయిల్‌పామ్ తోటలో గంజాయి డంప్


స్వాధీనం చేసుకున్న గంజాయి నిందితులతో ఎస్పీ తుహిన్ సిన్హా

- వాహనాలు తనిఖీ చేస్తుండగా గుట్టురట్టు
- 750 కేజీల గంజాయి, 3 ద్విచక్ర వాహనాలు, కారు స్వాధీనం
- 9 మంది నిందితుల అరెస్టు

అనకాపల్లి: పోలీసుల వాహనాల తనిఖీల్లో భారీ స్థాయిలో గంజాయి నిల్వ గుట్టురట్టయింది. కారులో తరలిస్తున్న 150 కేజీల గంజాయి పట్టుబడగా, దీనిపై తమదైన శైలిలో విచారించగా, ఆయిల్‌పామ్ తోటలో నిల్వ చేసిన మరో 600 కేజీల గంజాయి లభ్యమైంది. దీంతోపాటు మూడు ద్విచక్రవాహనాలు, ఒక కారు, రూ.2500 స్వాధీనం చేసుకుని, తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు గురువారం తెల్లవారుజామున రోలుగుంట, కొత్తకోట ఎస్ఐలు పి.రామకృష్ణారావు, ఎం.శ్రీనివాసరావు రోలుగుంట మండలం కొంతలం–అడ్డసరం గ్రామాల్లో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. మూడు ద్విచక్ర వాహనాలు, కారులో తరలిస్తున్న 150 కేజీలు గంజాయి పట్టుకున్నారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయగా రోలుగుంటకు చెందిన వియ్యపు గోవింద్ ఆయిల్ పామ్ తోటలో మరో 600 కేజీల గంజాయి నిల్వ చేసినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గోవింద్‌తోపాటు మాకవరపాలెం మండలానికి చెందిన బంగారు అప్పలనాయుడు ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా కలిమేలలో పాపులు వెంకటేష్ వద్ద 750 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. నాలుగు రోజుల క్రితం 600 కిలోల గంజాయిని తీసుకొచ్చి ఆయిల్ పామ్ తోటలో నిల్వ ఉంచారు. వీరికి రోలుగుంట మండలానికి చెందిన తమరాన వెంకట శ్రీనివాసరాజా, కడిమి రాకేష్, బొడ్డు నానాజీ, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన మారిగెల లక్ష్మణ్ రెడ్డి, మదుల శివ కుమార్ సహకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో హ్యుందాయ్ కారులో సీలేరు, మారేడిమిల్లి – తుని ద్వారా రోలుగుంటకు దఫాదఫాలు గంజాయి రవాణా చేస్తున్నారు. తాజాగా 150 కేజీల గంజాయి తరలిస్తుండగా పట్టుబడ్డారు. వీరిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదే కేసులో మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. గతంలో వియ్యపు గోవింద్‌పై నాలుగు, నల్లబిల్లి అంజిబాబుపై రెండు గంజాయి కేసులు నమోదై ఉన్నాయి. అనంతరం గంజాయి కేసులో ప్రతిభ కనబర్చిన రోలుగుంట, కొత్తకోట పోలీస్‌లకు ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. మొత్తం పట్టుబడిన గంజాయి విలువ రూ.37,50,000 ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

4న వెన్నుపోటు దినం

ర్యాలీకి అనుమతించాలని డీఎస్పీకి మాజీ ఎమ్మెల్యే గణేష్ వినతి


డీఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా వచ్చే నెల 4న వెన్నుపోటు దినాన్ని పురస్కరించుకుని శాంతియుత బైక్ ర్యాలీ చేపడుతున్నామని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ఈ ర్యాలీకి అనుమతించాలని గురువారం డీఎస్పీ పి.శ్రీనివాసరావును కలిసి లిఖిత పూర్వకంగా దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా హామీలు అమల్లో విఫలమైందన్నారు. సీఎం చంద్రబాబు ప్రజలను మరోమారు మోసం చేశారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల పక్షాన గళం వినిపించేందుకు పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శాంతియుత ర్యాలీ చేపడుతున్నామన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నియోజకవర్గ కేంద్రమైన నర్సీపట్నంలోని సీబీఎం కాంపౌండ్ నుంచి పెదబొడ్డేపల్లి జంక్షన్ వరకు ర్యాలీ సాగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. డీఎస్పీని కలిసిన వారులో మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, లీగల్ సెల్ ప్రతినిధి, కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర, నాయకుడు చింతకాయల వరుణ్ ఉన్నారు.

యాంత్రీకరణ సాగు లాభదాయకం

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహనరావు


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు

కశింకోట: ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం కావాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి. మోహనరావు కోరారు. యాంత్రీకరణతో వ్యవసాయం చేపట్టడం ద్వారా పని వేగం కావడంతో పాటు ఖర్చు తగ్గుతుందన్నారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ శాఖల సహకారంతో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు సంబంధించి సలహాలు, సూచనలను శాస్త్రవేత్తల ద్వారా రైతులకందించే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి. ప్రభాకరరావు మాట్లాడుతూ ఖరీఫ్‌లో మెట్ట ప్రాంతాల్లో కూరగాయల సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. పండ్ల తోటల పెంపకం, ఇతర ఉద్యాన వన పంటల వైపు రైతులు చొరవ చూపాలన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ గౌరి మాట్లాడుతూ చెరకు సాగులో విత్తన శుద్ధి చేసుకొని నాటాలన్నారు. పంట మార్పిడి చేస్తుండటం వల్ల ఎర్రకుళ్లు, పసుపాకు తెగుళ్లు నివారించవచ్చునన్నారు. బెల్లం తయారీలో అనారోగ్య కారక మందులు వినియోగించొద్దన్నారు. జిల్లా రిసోర్స్ కేంద్రం అధికారులు సీహెచ్. సుబ్రహ్మణ్యం, పి. శ్రీధర్ పంటల సాగులో రైతులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ఏవో ఎం. స్వప్న మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. బీసీటీ కేంద్రం భూసార శాస్త్రవేత్త మట్టి పరీక్షలు ప్రాధాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి రాజ్ని, కశింకోట, వెదురుపర్తి, తేగాడ తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చిననందిపల్లిలో వైభవంగా మరిడిమాంబ జాతర

ఆకట్టుకున్న పులి, దేవతామూర్తుల వేషధారణలు


చిననందిపల్లి జాతరలో కొయ్య రథంపై తిరుగుతున్న భక్తులు


ప్రత్యేక ఆకర్షణగా పులి వేషధారణలు

దేవరాపల్లి: మండలంలోని మరిడిమాంబ పండగ గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సంప్రదాయ బద్ధంగా నిర్వహించిన కొయ్య రథం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తొలుత ఈ రథానికి గ్రామస్తులు పసుపు కుంకుమ సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా తీన్‌మార్ వాయిద్యాలు, దేవతామూర్తుల వేషధారణలు, పులి వేషాలు జాతరలో విశేషంగా ఆకట్టుకున్నాయి. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

వాకీటాకీలతో కమిటీ సభ్యుల పర్యవేక్షణ....

గ్రామ జాతరలో కమిటీ సభ్యులంతా పండగ ఏర్పాట్లతోపాటు ఎటువంటి అవాంతరాలు ఏర్పడిన తక్షణమే స్పందించేందుకు వాకీటాకీలను వినియోగించారు. జాతరలో ఇలా తొలిసారిగా వాకీటాకీలతో కమిటీ సభ్యులు కనిపించడంతో పండగకు హాజరైన భక్తజనం ఆసక్తిగా తిలకించారు.

క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శ్రీరామాచార్యులు

కశింకోట: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, సహస్ర దేవాలయాల ప్రతిష్ఠాపకుడు రేజేటి శ్రీరామాచార్యులు జన్మదినోత్సవం గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సుమారు 300 మంది పేదలకు దుస్తులు, దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశారు. శ్రీరామాచార్యులకు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అర్చకులు రేజేటి కన్నబాబు, చక్రవర్తి, సీతారామాచార్యులు, మారుతి, కుటుంబ సభ్యులు, డాక్టర్ ఉజ్జి సూర్య మల్లేశ్వరరావు, బి. త్రినాథ్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి



ఆటలాడుతున్న విద్యార్థులు

కశింకోట: విద్యార్థులు ఆరోగ్యం పట్ల దృష్టి సారించాలని గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం కోరారు. మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఆరోగ్య జాగ్రత్తలు, గణితంపై గురువారం అవగాహన కలిగించారు. పలు ఆట పోటీలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కశింకోట: మండలంలోని బయ్యవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండబోదని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో కశింకోట, బయ్యవరం, విసన్నపేట, తేగాడ, రామన్నపాలెం, వెదురుపర్తి గ్రామాలకు నిర్దేశిత సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తులు

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు మండలంలో రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ ఎ.చక్రవర్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు పదో తరగతి నుంచి డిగ్రీ, డిప్లొమాలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. 16 నుంచి 35 సంవత్సరాలు మధ్య వయసు వారికి రెండు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఈ నెలాఖరులోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7013342667, 8143229228 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 77 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,600	4,740
రెండో రకం	3,900	4,160
మూడో రకం	3,000	3,440

అనకాపల్లి సినిమాలు

భైరవం	:రాజా
ఖలేజా	:సత్యనారాయణస్క్రీన్-1
కరాటే కిడ్-లిజెండ్స్	: సత్యనారాయణ స్క్రీన్-2
ఖలేజా	:పర్తిసాయి
సింగల్	:షిర్డీసాయి
ఏసీఈ	:వెంకటేశ్వర
శుభం	:శ్రీసత్య
షష్టిపూర్తి	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు, బీ పాజిటివ్-7, ఓ పాజిటివ్-10, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 368 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 299 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

ఆరోగ్యానికి వాకింగ్



రింగ్‌రోడ్డు బెల్లం మార్కెట్‌లో వాకింగ్ చేస్తున్న వాకర్స్

- కరోనా తర్వాత ప్రతి వ్యక్తికి ఆరోగ్యంపై శ్రద్ధ
- సర్వరోగ నివారిణిగా నడక
- నిత్యం నడిస్తే మంచిదని నిపుణుల సూచనలు

అనకాపల్లి: గతంలో మన పెద్దలు ఇంటి పని.. ఇతర పనులను స్వయంగా చేసుకోవడం, కిలో మీటర్ల కొద్దీ నడవటం వల్ల వారికి పెద్దగా వ్యాయామం అవసరం ఉండేది కాదు. అందుకు భిన్నంగా ఇప్పుడు జీవనయానం సాగిస్తున్న మనకు శారీరక శ్రమ ఉండటం లేదు. కాబట్టి నేటి మానవుడికి తప్పకుండా వ్యాయామం, వాకింగ్ వంటివి అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. నిత్యం బిజీగా ఉండే వ్యక్తులు రోజూ గంటపాటు వ్యాయామం చేయాలని చెబుతున్నారు. కరోనా వంటి విపత్తుల తర్వాత వ్యాయామంపై ప్రతి వ్యక్తి ప్రత్యేక దృష్టి సారించారు. మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లు, వాతావరణంలో మార్పుల కారణంగా ఊబకాయం, షుగర్, బీపీ, నరాల బలహీనత, కండరాలు బలహీనత వంటి అనేక వ్యాధులను ఎదుర్కొనేందుకు వ్యాయామం, నిత్యం వాకింగ్ చేస్తే మంచిదని చెబుతున్నారు.

నడకకు ప్రాధాన్యం....

పట్టణంలో ఎన్టీఆర్ క్రీడా మైదానం, గవరపాలెం పార్కు సెంటర్, శారదానది ఒడ్డున శాంతి పార్కు, రింగ్‌రోడ్డు పార్కు, రింగ్‌రోడ్డు రహదారి, ఎన్టీఆర్ బెల్లం మార్కెట్‌లోను, మండలంలో తుమ్మపాల బొజ్జన్నకొండ ఏలేరు కాలువ రహదారిలోను, కొత్తూరు పార్కుపై నిత్యం వేలాది మంది యువత, మహిళలు, చిన్నారులు వృద్ధులు వాకింగ్ చేస్తున్నారు. సమయాన్ని బట్టి ప్రతి ఒక్కరూ వాకింగ్‌పై దృష్టి పెడుతున్నారు. ఉదయం వాకింగ్ వల్ల సూర్య కిరణాల్లోని కాల్షియం ఎముకలకు మంచిదని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ శాతం మహిళలు ఉదయం వేళల వాకింగ్‌కు ప్రాధాన్యమిస్తున్నారు. ఉదయం కుదరని వారు మాత్రమే సాయంత్రం వాకింగ్ చేస్తున్నారు. పట్టణ, మండలం పరిధిలో 40 వరకూ వాకర్స్ క్లబ్‌లు ఏర్పడ్డాయి. వృద్ధుల నుంచి పిల్లల వరకు క్లబ్‌లు ఏర్పాటు చేసుకుని వాకింగ్, యోగా చేస్తున్నారు. జార్జి క్లబ్, రింగ్‌రోడ్డు, తుమ్మపాల వాటర్ ట్యాంక్ ఏరియా, ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో ఆయుష్మాన్ భారత్ ఆస్పత్రిలోను, గవరపాలెం మళ్ల జగన్నాథరావు కల్యాణ మండపం, రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలోను ఉదయం సమయంలో యోగాసనలు వేయిస్తున్నారు. వయస్సును బట్టి రోజుకు 30 నిమిషాల నుంచి గంటలోపు వాకింగ్ చేయాలని వైద్యులు సూచిస్తున్నారు.

నడకతో ప్రయోజనాలు...

- క్రమం తప్పకుండా నడవడం వల్ల శరీరంలో హార్మోన్లు విడుదలై మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.
- మానసిక ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ వంటి వాటిని అధిగమించవచ్చు.
- శరీర ఆకృతి బాగుంటుంది. గుండె, ఊపిరితిత్తులకు రక్తప్రసరణ సక్రమంగా జరిగి సమర్థవంతంగా పనిచేస్తాయి.
- గుండె సంబంధిత జబ్బులు, పక్షవాతం, నరాల బలహీనత వంటివి దరి చేరవు.
- అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి రోగాలను జయించవచ్చు.
- కీళ్లనొప్పులు తగ్గి, కండరాల శక్తి పెరిగి నడిచేందుకు వీలు కలుగుతుంది.
- శరీరానికి అధిక కొవ్వును తగ్గిస్తుంది.
- ఎముకలు దృఢంగా తయారవుతాయి.
- రక్తంలోని కొవ్వు కరుగుతుంది.
- మానవుని జీవితకాలం పెరుగుతుంది.
- మెదడు చురుగ్గా పనిచేస్తుంది.
- విటమిన్-డి లోపం ఉండదు. క్యాన్సర్ వ్యాధి సోకదు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.
- శరీరం దృఢంగా ఉండడమే కాకుండా చురుకుదనం పెరుగుతుంది.

నిత్యం నడవడం వల్ల శరీరానికి శక్తి



నేను బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశాను. నిత్యం వాకింగ్ వల్ల జీవిత కాలం పెరిగి యువకుడిలా పనులు చేయగలుగుతున్నాను. ఇద్దరు పిల్లలకు వివాహం చేశాను. 30 సంవత్సరాలుగా వాకింగ్ చేస్తున్నాను. వర్షం పడితే గొడుగు వేసుకుని వాకింగ్ చేస్తాను. ప్రస్తుతం అనకాపల్లి కోర్టులో లాయర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. ఆరోగ్యంగా జీవిస్తున్నాను. మంచి ఆహారం తీసుకుంటున్నాను.

– యడ్ల త్రినాథ్, వాకర్, ఎన్టీఆర్ క్రీడా మైదానం, అనకాపల్లి

కోవిడ్ తర్వాత వాకింగ్‌పై ఆసక్తి పెరిగింది



కోవిడ్ సమయంలో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. నిత్యం వాకింగ్ చేస్తాను. ప్రస్తుతం వ్యాపారంలో బిజీగా ఉన్నప్పటికీ రోజూ ఉదయం సమయంలో సుమారుగా గంటన్నర పాటు వాకింగ్‌కి చేస్తాను. కరోనా తర్వాత నుంచి రహదారులపై ఫాస్ట్‌ఫుడ్‌కు ఫుల్‌స్టాప్ పలికాను. రాత్రి సమయంలో 7 గంటలోపు ఆహారాన్ని తీసుకోవడం వల్ల మంచిగా నిద్రపడుతుంది.

– రాజాన అప్పారావు, వాకర్, ఎన్టీఆర్ క్రీడా మైదానం వాకర్స్ గౌరవాధ్యక్షుడు, అనకాపల్లి

40 ఏళ్లుగా వాకింగ్, స్విమ్మింగ్



మొదట్లో జిమ్‌లో వ్యాయామం చేసేవాడిని. వయస్సు పెరగడంతో ప్రస్తుతం వాకింగ్, స్విమ్మింగ్ మాత్రమే చేస్తున్నాను. శరీరం దృఢంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరిగా చేయాలి. వాకింగ్, స్విమ్మింగ్ చేయడం వల్ల రోగాల నుంచి విముక్తి పెరుగుతుంది.

– యల్లపు శివ, ఎన్టీఆర్ మార్కెట్ యార్డు వాకర్స్ అధ్యక్షుడు, గవరపాలెం, అనకాపల్లి

రోజూ వాకింగ్ చేయడం వల్ల ఆరోగ్యం

వాకింగ్ చేస్తుంటే ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. మానసిక ఒత్తిడి తగ్గడంతో వ్యాధుల బారి నుంచి విముక్తి కలుగుతుంది. బీపీ, సుగర్ రోగులు నిత్యం వాకింగ్ చేయడంతో శరీరంలో కండరాలు, ఎముకలు గట్టి పడి ఆరోగ్యంగా కనిపిస్తారు. వాకింగ్ చేయని రోజు ఎంతో బద్ధకంగా ఉంటుంది. వాకింగ్ చేసిన వ్యక్తి నిత్యం యువకుడిలా కనిపిస్తారు.

– ఎస్.శ్రీనివాసరావు, ఎన్టీఆర్ ఆస్పత్రి వైద్యుడు, అనకాపల్లి

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న పోలీస్ అధికారులు



సమావేశానికి హాజరైన ఆటోడ్రైవర్లు

అనకాపల్లి టౌన్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఆటోడ్రైవర్లు తమ ఆటోలను నడుపుకోవాలని డీఎస్పీ శ్రావణి సూచించారు. పట్టణంలోని రోటరీ క్లబ్ సమావేశ మందిరంలో ట్రాఫిక్ నియమాలపై ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి ఆటో నడపొద్దని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దని సూచించారు. ఆటో ప్రమాద కేసుల్లో డ్రైవింగ్ లైసెన్స్ రద్దయ్యే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ మోహన్‌రావు, ఎంవీఐ గోపీకృష్ణ, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, కశింకోట సీఐ స్వామి నాయుడు, రూరల్ సీఐ అశోక్‌కుమార్, పట్టణంతో పాటు, కశింకోట మండల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.4 లక్షలు

అనకాపల్లి: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో హుండీ కానుకలు లెక్కించారు. 69 రోజులకుగాను హుండీ ఆదాయం 4 లక్షల 45 వేల 825 రూపాయలు వచ్చినట్లు దేవాలయం ఇన్‌స్పెక్టర్ వసంత్‌కుమార్, ఆలయ ఈవో మరళీకృష్ణ తెలిపారు. భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని రాష్ట్ర దేవదాయ శాఖ బ్యాంకు ఖాతాలోకి జమ చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు పులకండం గిరిబాబు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



హుండీ కానుకలు లెక్కిస్తున్న అర్చకులు

ఇంటి ప్లాన్‌ల అనుమతులు సులభతరం

నర్సీపట్నం : పురపాలక సంఘంలో ఇంటి ప్లాన్‌ల నిబంధనలను ప్రభుత్వం సులభతరం చేసిందని టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ పి.నాయుడు పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్‌కు సడలించిన నిబంధనలపై అవగాహన కల్పించారు. ఇరుకు ప్రాంతాల్లో కూడా సులభంగా ప్లాన్ పొందేందుకు సర్క్యులేషన్ ప్యాట్రన్ విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ, ఇతర అభివృద్ధి పనులు చేయడం సాధ్యం కాని ప్రాంతాల్లో మాత్రమే సర్క్యులేషన్ ప్యాట్రన్ విధానం అమల్లోకి వస్తుందన్నారు. భవనాలు, లేఅవుట్ల అనుమతులు సులభతరం చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయగానే అనుమతులు వచ్చేలా ఏర్పాట్లు చేసిందన్నారు. భవన నిర్మాణ అనుమతులు సులభతరం చేసిందని ఎవరైనా అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసు నమోదు చేసి లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి పాల్గొన్నారు. హెచ్. హనుమంతు వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ పి.నాయుడు

ప్రశ్నించే వారిపై టీడీపీ కౌన్సిలర్ల దౌర్జన్యం

నర్సీపట్నం : ఎదురు ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక దౌర్జన్యానికి పాల్పడుతున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రతినిధి, కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర పేర్కొన్నారు. సమావేశం అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.20 కోట్లు తీసుకువచ్చారనడంలో వాస్తవం లేదన్నారు. వీఎంఆర్‌డీఏ నుంచి స్పీకర్ కేవలం రూ.5 కోట్లు మాత్రమే తీసుకువచ్చారన్నారు. మిగిలిన నిధులు 15వ ఆర్థిక సంఘం నిధులు అన్నారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ బాక్సింగ్ రింగ్ నిర్మాణానికి నిధులు తీసుకు వస్తే కూటమి నాయకులు రింగ్ కట్టకుండా అపేసారని తెలిపారు. పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు రూ.166 కోట్లు తీసుకువచ్చి, మా ప్రభుత్వంలో 50 శాతం పనులు పూర్తి చేస్తే ఈ రోజు అతీగతీ లేదన్నారు. నిధులు కేటాయింపుల్లో రాజకీయ వివక్షకు పాల్పడుతున్నారన్నారు. టీడీపీ వార్డులకే నిధులు ఇచ్చి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఉన్న వార్డులకు నిధులు ఇవ్వడం లేదన్నారు. మెయిన్ రోడ్డును తమ ప్రభుత్వంలో వంద అడుగుల మేర కొంత వరకు రోడ్డును విస్తరిస్తే కూటమి నాయకులు రోడ్డు విస్తరణను గాలికి వదిలేసారన్నారు. కొద్దిపాటి వర్షం పడితే మెయిన్ రోడ్డు ముంపునకు గురవుతుందన్నారు. స్పీకర్ కుటుంబానికి నియోజవర్గ ప్రజలు సుదీర్ఘకాలం పాటు అధికారం ఇస్తే అభివృద్ధిని గాలికి వదిలేసి, ఇప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వీటిన్నింటిపై కౌన్సిల్‌లో నిలదీస్తే దౌర్జన్యానికి దిగుతున్నారని అన్నారు. ఎల్లప్పుడూ ఒకే ప్రభుత్వం ఉండదన్న విషయాన్ని కూటమి కౌన్సిలర్లు గ్రహించాలన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి చినముషిడివాడకు చెందిన ఎస్.నర్సింగరావు రూ.లక్ష 116 విరాళాన్ని గురువారం అందించారు. సంబంధిత విరాళాన్ని సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటర్లో నగదు రూపంలో ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్ అందించారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా శోభనాద్రి

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా టి.శోభనాద్రి గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి బ్రాంచ్ నుంచి సాధారణ బదిలీపై ఇక్కడకు వచ్చినట్టు ఆయన చెప్పారు. ఇక్కడ విధులు నిర్వహించిన దాసరి రమేష్ విశాఖ మెయిన్ బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లారు.

7న శ్రీనివాస కల్యాణోత్సవం

కశింకోట: స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో వచ్చే నెల 7న శ్రీనివాస కల్యాణోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు తెలిపారు. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ విగ్రహాలకు వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరపనున్నామన్నారు. అదే రోజు మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

సిరసపల్లిలో ఘనంగా దుర్గాలమ్మ పండగ

అనకాపల్లి: జీవీఎంసీ విలీనగ్రామైన సిరసపల్లిలో గ్రామ దేవత దుర్గాలమ్మ పండగ గురువారం జరిగింది. తెల్లవారుజాము నుంచి కె.ఎస్.ఆర్.పేట, రాజుపాలెం, సిరసపల్లి గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



దుర్గాలమ్మ అమ్మవారు

మతసామరస్యాన్ని కాపాడుకోవాలి

అనకాపల్లి టౌన్: లౌకికతత్వం మతసామరస్యాన్ని కాపాడుకోవాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె. లోకనాథం తెలిపారు. దేశ సమగ్రత పరిరక్షణకు చేపట్టిన సమైక్యతా యాత్ర పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని సమైక్యంగా ఎదుర్కోవాల్సిన సమయంలో కేంద్ర ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మైనార్టీలపై వ్యతిరేకతను నూరిపోస్తుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరావు, కార్యదర్శి వర్గ సభ్యుడు డి వెంకన్న, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యనారాయణ, ఆర్ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.



సమైక్యతా యాత్రలో పాల్గొన్న సీపీఎం నాయకులు

వర్షపు నీటితో రాకపోకలకు ఇబ్బందులు

కశింకోట: స్థానిక స్టేట్ బ్యాంక్ వద్ద రోడ్డులో ఏ మాత్రం వర్షం పడినా నీరు నిలిచిపోతోంది. వాహన రాకపోకల సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు పల్లంగా ఉండటంతో నీరు వెళ్లే మార్గం లేక నిలిచిపోతోంది. వేసవిలో ఎండ కాసినప్పుడు పరిస్థితి ఎలా ఉన్నా, వర్షం పడితే మాత్రం ఈ పరిస్థితి తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. చాలా కాలంగా ఇదే పరిస్థితి ఉన్నా, ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



స్టేట్ బ్యాంకు రోడ్డులో వర్షపు నీరు

రాజకీయ కక్షతోనే చెక్ పవర్ రద్దు

- వెన్నలపాలెం సర్పంచ్ వెన్నల అప్పారావు

పరవాడ: రాజకీయ కక్ష సాధింపులకు కూటమి నేతలు తెర తీసి, ప్రతిపక్ష పార్టీ సర్పంచ్‌పై వేధింపులకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. కూటమి నేతల ప్రోద్బలంతో వెన్నలపాలెం సర్పంచ్ వెన్నల అప్పారావుకు మూడు నెలల పాటు చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాజకీయ కక్షలతో గ్రామాభివృద్ధికి ఎక్కడికక్కడ ఆటంకాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ అప్పారావు సాక్షితో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులను అణగదొక్కాలన్న ఉద్దేశ్యంతో అధికార పార్టీ నాయకులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికార పార్టీ నేతలు తనపై రాజకీయ దురుద్దేశంతో లేనిపోని అవినీతి ఆరోపణలు చేసి, చెక్ పవర్ రద్దు చేయించారన్నారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు తెలిపారు. ఇదిలావుండగా వెన్నలపాలెంలోని కల్యాణ మండపానికి సంబంధించి రూ.21 లక్షలను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేశారన్న కూటమి నాయకులు ఫిర్యాదుతో సర్పంచ్ చెక్ పవర్‌ను మూణ్నెల్ల పాటు నిలుపుదల చేస్తున్నట్లు డీపీవో శిరీషరాణి గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సాంకేతికతతోనే రైతుల అభ్యున్నతి

పాయకరావుపేట: నూతన సాంకేతిక పద్ధతులను అనుసరించి రైతులు మరింతగా అభ్యున్నతి చెందాలని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి(రాజమండ్రి) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్ అన్నారు. మండలంలోని ఆర్.కొత్తూరు, ఆర్.నర్సాపురం గ్రామాల్లో గురువారం విక్షిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, వాటి ఉపయోగం గురించి వివరించారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కుర్రా మాట్లాడుతూ వరిలో నూతన రకాలు, కొబ్బరి, మామిడి, జీడి, తమలపాకు తోటల్లో మేలైన యామామాన్యం పద్ధతులు, చీడపీడల నియంత్రణపై అవగాహన కల్పించారు. వ్యవసాయంలో యాంత్రీకరణ ప్రాధాన్యత గురించి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కె.ఉమా ప్రసాద్ వివరించారు. మండల వ్యవసాయ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రెడ్డి సీత, గోపి, ఉపసర్పంచ్ గోవిందరాజు, స్వామి, తాండవ ఎఫ్‌పీవో నుంచి సత్యనారాయణ, జిల్లా వనరుల అధికారి విజేత, సీనియర్ నాయకులు సీతారాం, నాగేశ్వరరావు, కోనే రంగయ్య, జోగి నాయుడు, గాంధీ, జోగిరాజు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, శాస్త్రవేత్తలు బండి నాగేంద్ర ప్రసాద్, డాక్టర్ ఎం.శివ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. స్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.